


RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

నిజానికి రాయల్ స్వరం

ద్వి భాషా దినపత్రిక

ROYAL JOURNALISM

గుంటూరు, సంపుటి : 03 సంచిక : 147 | మంగళవారం 3 - 2 - 2026 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 వెల : రూ.2-00

GUNTUR VOL-03 ISSUE - 147 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 3 TUESDAY february 2026 PAGES : 8 Rs :2-00


# రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు



- అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు: ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదు
- లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది: అందుకే ఫ్రస్టేషన్‌లో నానా యాగీ చేసే ప్రయత్నాలు
- వైకాపా కుట్రలతో టిడిపి నేతలు జాగ్రత్తగా ఉండాల్సిందే: పార్టీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

అమరావతి: రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు పన్నుతోందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని.. అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైకాపా పుట్టింది. ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదని చంద్రబాబు అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని చీదరించుకుంటున్నారు. చేసిన పాపాలను దారిమళ్లించాలనేది వైకాపా కుట్ర. పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా. అది వైకాపా నేతలకు నచ్చడం లేదు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతాం. తెదేపా కార్యకర్తలు సంయమనం పాటించేలా మంత్రులు, నేతలు బాధ్యత తీసుకోవాలి. కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైకాపా ట్రాప్‌లో పడొద్దు. అలా జరగకుండా పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇకపోతే రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు, శాంతిభద్రతల అంశం, పాలనలో మార్పులు వంటి విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తాజా ట్వీట్ చర్చకు దారితీసింది. వైసీపీపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని జీర్ణించుకోలేక వైసీపీలో ఫ్రస్టేషన్ పెరిగిందని చంద్రబాబు విమర్శించారు. ÷ూజకీయాలను నేరమయం చేయడమే వైసీపీ సిద్ధాంతమని, వారి పాలనలో చట్టవిరుద్ధ పాలనకు అనేక ఉదాహరణలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. జగన్ హయాంలో చట్టాన్ని పక్కనపెట్టి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అనేక అక్రమాలు, చట్టవిరుద్ధ చర్యలే దీనికి నిదర్శనమని ప్రస్తావించారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ జగన్ పాలన కొనసాగిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో రూల్ ఆఫ్ లా గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 2024 తర్వాతే రాష్ట్రంలో నిజమైన చట్టపాలన అమలవుతోందని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో చట్టం పేరుకే ఉండేదని అధికారమే అన్నింటికీ ఆధారంగా మారిందని విమర్శించారు. ప్రజలకు న్యాయం అందాలంటే రాజ్యాంగమే సుప్రీమ్‌గా ఉండాలని, అదే తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే అధికారం ఎవరికీ లేదని, అది ఏ పార్టీకి చెందిన వారైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని చంద్రబాబు అభివర్ణించారు. గతంలో క్షీణించిన శాంతిభద్రతల పరిస్థితిని పునరుద్ధరించామన్నారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఉద్ఘాటించారు. శాంతిభద్రతలను ఉల్లంఘించే ప్రయత్నాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కూడా ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న పునర్నిర్మాణ పక్రియను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీఎం విమర్శించారు. వారు విధ్వంసం చేసిన వ్యవస్థలను మళ్లీ నిర్మిస్తున్న తీరును చూసి అసహనంతో దూషణలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు సేవ చేయడం, వారికి సాధికారిత కల్పించడమే తమ ప్రభుత్వ సిద్ధాంతమని స్పష్టం చేశారు. ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు సేవ చేయటం, వారికి సాధికారిత కల్పించటమే తమ ప్రభుత్వ సిద్ధాంతమని తెలిపారు. పాలనలో పారదర్శకత, చట్టబద్ధత, బాధ్యతాయుత పాలన తమ లక్ష్యాలని స్పష్టం చేశారు. వైసీపీ నిజ స్వరూపం ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతోనే ఆ పార్టీ నాయకులు అసహనంతో వ్యవహరిస్తున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

# కులం కాదు..గుణం చూసి ఓటేయండి



హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు. చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతున్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ అన్యాయం చేసిందని కవిత విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గంజాయి ముఠా దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ ఫీజు సొంతంగా కట్టుకున్నారా..? ప్రభుత్వ సొమ్ముతో కట్టారా అని ప్రశ్నించారు.రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఎన్ని ఏంఓయూలు చేసుకున్నారని నిలదీశారు. ఫేక్ కంపెనీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఫేక్ ఎంఓయూలపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. ఫేక్ ఏంఓయూలపై జాగృతి పోరాటం చేస్తుందని కవిత పేర్కొన్నారు.

# సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు సరికాదు

- చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ అని ఎలా ప్రకటిస్తారు: ఇది పోలీస్ మాన్యువల్‌కు వ్యతిరేకం అని తెలియదా
- కెసిఆర్ విచారణ తరవాత ప్కటనపై హరీష్ రావు అభ్యంతరం



హైదరాబాద్,: చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ విచారణ ముగిసిందని నగర పోలీస్ కమిషనర్, సిట్ ఇన్‌ఛార్జ్ సజ్జనార్ చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విచారణలోనే ఉన్నప్పుడే ఇల్లీగల్ అని ఎలా తేల్చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అవునా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిర్ణయాంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని అక్రమంగా పేర్కొనడం చట్ట విరుద్ధమని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ తరహా వ్యాఖ్యలు సిట్ చీఫ్ సజ్జనార్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా పరిగణించకూడదన్నది స్థిరమైన న్యాయసూత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమైన డాక్టరిన్ ఆఫ్ ప్రిజంప్షన్ ఆఫ్ ఇన్నెసెన్స్ చెబుతుందని తెలిపారు. దర్యాప్తు చేయడమే పోలీసుల బాధ్యత తప్పు.. తీర్పు చెప్పే అధికారం వారికి లేదని వ్యాఖ్యానించారు..ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా అన్నది భారత టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ అలాగే పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందో లేదో న్యాయస్థానమే నిర్ణయించాల్సి ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యిందని చేసిన అధికారిక ప్రకటనలోనే అక్రమమం అని తేల్చడం సరికాదని అన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు దర్యాప్తు ఫలితంపై ముందస్తు అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఇది ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1968కు విరుద్ధమని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడికి సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం ద్వారా దర్యాప్తులో నిష్పక్షపాతత్వంపై అనుమానాలను కలిగిస్తున్నాయని తెలిపారు. విచారణకు ముందే తప్పు జరిగిందనే భావన కలిగించేలా చేసిన ప్రకటనలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. పోలీస్ కమ్యూనికేషన్లను రాజకీయ కథనాలను బలపరిచేందుకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా, వృత్తిపరంగా చట్ట పరిధిలోకి లోబడే పనిచేయాలని హరీశ్‌రావు సూచించారు. పోలీసుల ప్రకటనల ద్వారా కాకుండా తీర్పులను కోర్టులు ఇవ్వాలని అన్నారు. రాజ్యాంగ పరిమితులను దర్యాప్తు సంస్థలు విస్మరిస్తే ప్రజాస్వామ్యం నిలవదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను సిట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో హరీష్‌రావు ఒక పోస్టు పెట్టారు. పోలీసులకు దర్యాప్తు బాధ్యత మాత్రమే అప్పగించబడిందని, విచారణ దశలో ఏదైనా చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి పోలీసులు న్యాయమూర్తులో లేదా న్యాయనిర్ణేతలో కాదని పేర్కొన్నారు.

# గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్



హైదరాబాద్: గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు – మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు, సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల చేశామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్దిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ది పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్ప.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. 7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు. హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి.. తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ఎందుకొచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని గుర్తు చేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని.. ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు బయటపడాల్సిందే

దోషులు ఎవరో తేల్చాల్సి ఉంది: ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు లేవు: మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల సంభాషణలు వినే దుశ్చర్యకు పాల్పడితే విచారణ జరపాలా వద్దా అని ప్రశ్నించారు. తప్పుచేసి మాపైనే అభియోగాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీదా కక్ష సాధింపు ఆలోచన లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చిందన్నారు. సాధారణంగా ఉగ్రవాదులు, ఆటంకవాదుల ఫోన్లను ట్యాప్ చేస్తారని.. కానీ ఇక్కడ నాయకులు, జడ్జిలు, వ్యాపారవేత్తల ఫోన్లనే ట్యాప్ చేశారని చెప్పారు. ఆధారాలు లభించిన నేపథ్యంలో విచారణ జరుగుతోందని తెలిపారు.ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారు? ఎందుకు చేశారో.? తేల్చాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బీజేపీ నేతలు బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలని డిమాండ్ చేశారని ప్రస్తావించారు. వారి కుటుంబ సభ్యులు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారన్నారు. ఈ నీచానికి ఎవరు ఒడిగట్టారో విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. దుశ్చర్యకు పాల్పడ్డవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

# అన్ని రంగాల్లోను జిల్లా ప్రకాశించేలా చర్యలు

రాయల్ జర్నలిజం( ఒంగోలు) ఫిబ్రవరి 2 : అన్ని రంగాల్లోనూ జిల్లా ప్రకాశించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి చెప్పారు. ప్రకాశం జిల్లా 57వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ప్రకాశం భవనంలో ఘనంగా జరిగింది. ముందుగా ఈ ప్రాంగణంలో ఉన్న ప్రకాశం జిల్లా పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ప్రకాశం పంతులు విగ్రహానికి కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీవి.హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్కకల్పనా కుమారి, మేయర్ గంగాడ సుజాత, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్పర్సన్ ఎం.సుచిత్రలతో కలిసి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, మౌలిక రంగాలలో జిల్లాను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఎంతో కీలకమైన వెలుగొండతోపాటు పాలేరు, కొరిశపాడు ప్రాజెక్టులకు కూడా వచ్చే బడ్జెట్లో ప్రాధాన్యం కల్పించబోతున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాలలో సి.బి.జి. ప్లాంట్లు, దొనకొండలో పరిశ్రమల స్థాపన ద్వారా తలసరి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. బేస్తవారిపేటకు రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించేలా చర్యలు తీసుకుంటామని, రహదారులు, రైల్వే ప్రాజెక్టుల విషయంలో కేంద్ర సహకారం కోరుతున్నామని చెప్పారు. పామూరులో త్రిబుల్ ఐటీ ఏర్పాటు చేసేందుకు గతంలో టిడిపి ప్రభుత్వంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఆ నిర్ణయానికి నేడు కూడా కట్టుబడి ఉన్నట్లు మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వెనుకబాటు నుంచి అభివృద్ధి దిశగా పయనిస్తున్న జిల్లాను మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ సహజ, మానవ వనరులను సద్వినియోగం చేసుకుంటూ వెనుకబాటును అధిగమించి అభివృద్ధి చెందిన జిల్లాగా ఆవిష్కృతమయ్యేలా అధికార యంత్రాంగం దృష్టి సారించింది అన్నారు. ఈ ఏడాది వెలుగొండ నీళ్లు వస్తాయన్నారు. రెండు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వచ్చే నౌకలను ఆపరేట్ చేసే స్థాయిలో రామాయపట్నం పోర్టు అందుబాటులోకి రానున్నదని, బీపీసీఎల్, ఇండోసోల్, ఆక్వా, గెలాక్సీ గ్రానైట్ వంటి పరిశ్రమలు జిల్లాకు వన్నె తెస్తున్నాయన్నారు. హార్టికల్చర్ హబ్ గా కూడా జిల్లా మారుతుందన్నారు. వీటి ద్వారా విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు స్వాతంత్ర సమరయోధుల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహనీయులను అందించిన ప్రకాశం జిల్లాలో విధులు నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. అన్నింటా జిల్లా ముందంజలో ఉండటంలో పోలీస్ శాఖ తరపున అవసరమైన పాత్ర పోషిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర క్అభివృద్ధికి అవసరమైన అవకాశాలు జిల్లాలో పుష్కలంగా ఉన్నాయన్నారు. జిల్లాపై అవగాహన పెంచుకొని ఈ దిశగా తాను దృష్టి సారిస్తానన్నారు. మేయర్ మాట్లాడుతూ ఘన వారసత్వం కలిగిన ప్రకాశం జిల్లా.... అభివృద్ధి విషయంలోనూ తనదైన గుర్తింపు సాధించే దిశగా పయనిస్తోందన్నారు. సుచిత్ర మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పనిచేస్తే రెట్టింపు అభివృద్ధి సాధించవచ్చు అన్నారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ మహనీయుల ఆశలను స్మరించుకుంటూ జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన వివిధ రంగాల్లోని ప్రముఖులను ఈ కార్యక్రమంలో సన్మానించారు. టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనవళ్ళు అయిన హనుమంతరావు, సంతోష్, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు అయిన కరవది సుబ్బలక్ష్మి, గంగవరపు భాస్కరరావు, ప్రముఖ వైద్యులు, రెడ్ క్రాస్ జిల్లా మాజీ అధ్యక్షులు చలమయ్య, కవులు పాటిబండ్ల ఆనందరావు, పొన్నూరు శ్రీనివాసరావు, సంపత్ కుమార్, నళిని ప్రియా కూచిపూడి నృత్య శిక్షణ సంస్థ వ్యవస్థాపకురాలు శ్రీమతి శివకుమారి, టెన్నిస్ క్రీడాకారుడు చిరంజీవి సన్మానం పొందారు. జిల్లా విశిష్టతను తెలియజేసేలా ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ అంశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ జయంతి బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైఎస్సార్సీపీ నేతలపై దాడులు దారుణం

## రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి - జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి




రాయల్ జర్నలిజం( ఒంగోలు) ఫిబ్రవరి 02 : గత మూడు రోజులుగా రాష్ట్రంలో వైఎస్సార్సీపీ నేతలపై జరుగుతున్న దాడులు అత్యంత ఆందోళనకరమని జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. అంబటి రాంబాబు, జోగి రమేష్ నేతల ఇళ్లపై జరిగిన దాడులు ప్రజాస్వామ్యానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలని పేర్కొన్నారు. లడ్డు లో నెయ్యి కల్తీ జరిగిందంటూ దుష్ప్రచారం చేస్తూ, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ఈ నేపథ్యంలో ఫ్లెక్సీలను తొలగించాలని అంబటి రాంబాబు విజ్ఞప్తి చేయగా, దానికి ప్రతిగా టీడీపీ నేతలు కర్రలతో దాడులకు దిగడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ ఘటనల సమయంలో పోలీసులు కేవలం ప్రేక్షకుల్లా వ్యవహరించడం మరింత ఆవేదన కలిగించిందన్నారు. క్షణికావేశంలో అంబటి రాంబాబు పరుష పదాలు వాడిన విషయం నిజమేనని, అందుకు ఆయన క్షమాపణ కూడా చెప్పారని గుర్తు చేశారు. అయినప్పటికీ ఆ అంశాన్ని పక్కనపెట్టి ఆయనపై, ఆయన నివాసంపై దారుణంగా దాడి చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. బాధ్యత గల ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బూచేపల్లి స్పష్టం చేశారు. కానీ కార్యకర్తలు రెచ్చిపోతున్నా మౌనం పాటించడం ఏ విధమైన సంకేతమని ప్రశ్నించారు. గతంలో కాపు నేత ముద్రగడ పద్మనాభాన్ని కూడా దాడులకు గురి చేసిన ఘటనలను ఆయన గుర్తు చేశారు. రౌడీ మూకలను ప్రోత్సహించడం సిగ్గుచేటని, దాడులు చేయడం కాదు ప్రజలకు పనులు చేసి చూపించాల్సిన అవసరం ఉందన్నారు. మీ దాడులకు, కేసులకు ఎవరూ భయపడరని హెచ్చరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రపతి పాలనపై కూడా చర్చ రావాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఒంగోలు సహా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రెచ్చగొట్టే ఫ్లెక్సీలను జిల్లా ఎస్పీ తక్షణమే జోక్యం చేసుకుని తొలగించాలని బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు.

# మహాశివరాత్రికి పాకల బీచ్‌లో సంబరాలు!

## ఫిబ్రవరి 14, 15న బీచ్ ఫెస్టివల్‌కు ప్రభుత్వ ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్‌ను కోరిన రాష్ట్ర మ్యారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ



రాయల్ జర్నలిజం (ఒంగోలు) ఫిబ్రవరి 02 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 14, 15 తేదీల్లో పాకల బీచ్‌లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మ్యారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ప్రకాశం భవనంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన, బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించి వినతిపత్రాన్ని సమర్పించారు. పర్యాటకాభివృద్ధితో పాటు స్థానిక యువతకు, వ్యాపారులకు ఈ ఫెస్టివల్ ద్వారా ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిని కూడా మర్యాదపూర్వకంగా కలిసి, మహాశివరాత్రి సందర్భంగా పాకల బీచ్‌ను రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ బీచ్ ఫెస్టివల్ ద్వారా భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో పాకల బీచ్‌కు తరలివచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా భద్రత, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పనపై ముందస్తు చర్యలు అవసరమని తెలిపారు.



# ద్విచక్ర వాహనాల చోరుడు అరెస్టు



రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 02: జల్సాలకు అలవాటు పడి డబ్బుకు దాసోహం అయ్యి ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న యువకుడిని బాపట్ల పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సాయంత్రం ఎస్సై నస్రీన్ షా చాకచక్యంగా రైల్వే స్టేషను వద్దకు చేరుకుని యువకుడిని పట్టుకుని మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవటం జరిగింది అని పట్టణ సీఐ రాంబాబు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. చేడుగుడి అభిరామ్ (23) చిల్లరగొల్లపాలెం చెందిన వ్యక్తి, యాదవపాలెం లో నివాసం ఉంటూ నేరాలకు పాల్గొన్నాడు అన్నారు. నిందితుడిపై క్రైమ్ నెంబర్ 20/26, 19/26, 7/26 నమోదు అయినవి అన్నారు. ద్విచక్ర వాహనాలు చోరీ చేసి, ఫైనాన్స్ కంపెనీ రికవరీ చేసిన వాహనాలుగా చెబుతూ తక్కువ ధరకే విక్రయాలు చేస్తుంటారు అన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల కట్టడి కోసం తెల్లవారుజాము నుంచి పోలీసుల సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని ద్విచ్రక వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. మీ పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు వస్తే వారిపై అనుమానం ఉంటే తమకు పిర్యాదు చేయాలన్న సీఐ



తెలిపారు. పట్టణ ఎస్సై సుమన్, కానిస్టేబుల్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో భద్రత శూన్యం - అధికారుల నిర్లక్ష్యానికి మరో నిదర్శనం



రాయల్ జర్నలిజం(బాపట్ల) ఫిబ్రవరి 02 : ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన జిల్లా కలెక్టరేట్ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారింది. బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) వద్ద అధికారుల నిర్లక్ష్యం తీవ్ర ప్రమాదానికి దారి తీసింది. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ ఆటో కార్మికుడు మెయిన్ కౌంటర్ వద్ద నీళ్లతడిలో కాలుజారి కిందపడిపోవడంతో తలకు తీవ్రమైన గాయమైంది. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో పిజిఆర్ఎస్ నిర్వహించటం ఆనవాయితీ. అయితే సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి వందల సంఖ్యలో అర్జీదారులు రావడంతో కలెక్టరేట్ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ రద్దీ మధ్య పిజిఆర్ఎస్ మెయిన్ కౌంటర్ వద్ద నీళ్లు నిలిచిపోయి ప్రదేశం పూర్తిగా అశుభ్రంగా మారింది. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఆటో నడిపే కార్మికుడు తన సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు పిజిఆర్ఎస్‌కు వచ్చాడు. మెయిన్ హాలు వద్ద నీళ్లతో నిండిన ప్రదేశంలో అడుగు పెట్టగానే అతను కాలుజారి వెల్లకిలా కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తల వెనుక భాగంలో తీవ్ర గాయం కావడంతో చుట్టుప్రక్కల ఉన్న ప్రజలు పోలిసులు స్పందించి వెంటనే అతనిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గాయానికి రెండు కుట్లు కూడా పడినట్లు బాధితుడు వెల్లడించాడు. అనంతరం రక్తగాయాలతోనే తిరిగి వచ్చి జిల్లా కలెక్టర్‌కు తన ఫిర్యాదును సమర్పించాల్సిన దుస్థితి నెలకొంది. బాధితుడు మాట్లాడుతూ, గతంలో కూడా ఇదే ప్రాంతంలో కాలుజారి పడే ప్రమాదం జరిగిందని, అప్పట్లో గోడను పట్టుకోవడంతో పెద్ద



ప్రమాదం తప్పిందని తెలిపారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నేడు తీవ్ర ప్రమాదం చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో అక్కడున్న ప్రజలు తీవ్రంగా మండిపడ్డారు. ఇదే సమయంలో అదే ప్రాంతంలో ఓ చిన్నారి కూడా కాలుజారి కిందపడటం కలకలం రేపింది. ఒకే చోట, ఒకే సమయంలో ఇద్దరు జారిపడటం ప్రజల తప్పు కాదని, పూర్తిగా అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వచ్చే సామాన్య ప్రజలకు కనీస భద్రత, శుభ్రత కూడా కల్పించలేని పరిస్థితి నెలకొందని అర్జీదారులు ఆరోపిస్తున్నారు. ప్రజా సమస్యల వేదికలోనే ప్రజలకు కొత్త సమస్యలు సృష్టించడమేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని, పిజిఆర్ఎస్ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచి, ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# జర్నలిస్టులపై వేధింపులు, దాడులను ఖండించండి



రాయల్ జర్నలిజం (ఒంగోలు), ఫిబ్రవరి 02: ప్రజాస్వామిక జర్నలిస్టులపై వేధింపులు, దాడులను ఖండించాలని, ప్రజలు ప్రజాస్వామిక వాదులు వారికి అండగా నిలవాలని పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలు అంబేద్కర్ భవనంలో డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టులపై వేధింపులు, దాడులను నిరసిస్తూ ప్రజాసంఘాల సమన్వయంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం గౌరవ సలహాదారులు, న్యాయవాది డాక్టర్ నూకతోటి రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ దేశంలో ఈ పదేళ్ల కాలంలో 20 మందికి పైగా జర్నలిస్టులను హత్య చేశారని, 150 మందికి పైగా జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేశాన్నారని అన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది షేక్ కరీముల్లా, న్యాయవాది మన్నం సుధీర్, రైతు సంఘం నాయకులు చందూరి రంగారావు, ఓపిడిఆర్ అధ్యక్షుడు చావలసిన సుధాకర్, ఏఐ బిఎస్పీ ప్రతినిధి ధరణికోట లక్ష్మీనారాయణ బివైసి జిల్లా అధ్యక్షుడు విరీయం శ్రీనివాస్, మాల జేఏసీ కొండలు, విసికె జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆదినారాయణ, సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా సెక్రెటరీ అబ్దుల్ సత్తార్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు బొట్ల తదితరులు పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను బతికిస్తున్న జర్నలిస్టులకు అండగా ఉండాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తొలుత, మైనింగ్, ఇసుక మాఫియా చేసిన హత్యల కారణంగా చనిపోయిన జర్నలిస్టులకు నివాళులర్పిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత కత్తి కళ్యాణ్ సంపాదకత్వంలో ప్రచురిస్తున్న' మన కాలం' మాసపత్రికను ఆవిష్కరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో. కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రసన్న రాజు, ఉద్యోగుల ఐక్యవేదిక తుల్లిబిల్లి అశోక్, విద్యార్థి సంఘ జేఏసీ అధ్యక్షుడు రాయపాటి జగదీష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద మాదిగ, రచయితల సంఘ అధ్యక్షుడు ఏడ్రా శాస్త్రి, వాజా రాష్ట్ర అధ్యక్షుడు గుండా మల్లికార్జున రెడ్డి, జర్నలిస్టులు, న్యూస్ 99 బ్యూరో స్టాలిన్ బాబు, జూపూడి గురుకాంతాచారి, దిశ ఎన్. నాగార్జున రెడ్డి, కళాంజలి సుబ్బారావు, వజ్రాయుధం రామకృష్ణ, గద్దల శివాజీ, రత్నం, నూకతోటి శరత్ బాబు, బెంజిమెన్, సంజీవరావు, కాలేషా వలి, రజని, కవి మధుర శ్రీ, డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం కన్వీనర్ బొడ్డు శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు షేక్ నాసిర్ అహ్మద్, పాలపర్తి సతీష్, తెలగతోటి భరత్ కుమార్, పైనం సురేంద్ర, యోన, సంతోష్, జాన్ బాబు, సూరజ్, సురేంద్ర, మురళి, ప్రకాశం జిల్లా కిసాన్ మోర్చా వేముల మోజేష్, రాజారావు, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# నిత్యవసర వస్తువుల పంపిణీలో పారదర్శికత జవాబుదారితనం ఉండాలి

## 17.35 క్వింటాళ్ల బియ్యం అదనపు నిల్వలు గుర్తింపు



రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 02: నిత్యవసర వస్తువుల పంపిణీలో పారదర్శికత జవాబుదారితనం ఉండాలని డిప్యూటీ తాహసిల్దార్ ఫణికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని తటవర్తి భానురేఖ, భర్త లక్ష్మీ నారాయణ నిర్వహిస్తున్న చౌక ధరల దుకాణం నెం.0789014 ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షాపులో ఉండవలసిన బియ్యం నిల్వలు 3,710 కేజీలు కాగా, 5,445 కేజీలు నిల్వ ఉండటంతో 1,735 కేజీలు (17.35 క్వింటాళ్లు) అదనపు బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో సదరు డీలర్‌పై జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేయుచూ, తగిన క్రమశిక్షణ చర్యల కోసం ఆర్‌డీఓ, బాపట్ల వారికి నివేదిక ఇచ్చినట్లు ఆయన చెప్పారు. వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే సరుకుల పంపిణీ చేయాలని, నిర్ణీత సమయాల్లో షాపులు తెరిచి సరుకులు అందించాలని తెలిపారు. నిల్వల్లో వ్యత్యాసాలు ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చౌక సరళ దుకాణాలు సమర్థవంతంగా పనిచేయాలని, లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేయాలని ఆయన తెలిపారు. చౌక దుకాణాలను పర్యవేక్షించడం, పిడిఎస్ ప్రయోజనాలను పారదర్శకంగా, సమర్థవంతంగా ఉద్దేశించిన నిర్దేశించిన లబ్ధిదారులకు చేరేలా చూడడం కోసం నిరంతరం పర్యవేక్షణలు చేయడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో విఆర్ఓ నాగేశ్వరరావు, విఆర్ఓ లు సుధీర్, జాషువ పాల్గొన్నారు.

# బాపట్లలో మెగాస్టార్ చిరంజీవి యువత ప్రత్యేక పూజలు



రాయల్ జర్నలిజం(బాపట్ల), ఫిబ్రవరి 02: బాపట్ల పట్టణంలోని శ్రీ సువర్చల సమిత శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో రాష్ట్ర చిరంజీవి యువత ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి తనయుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ -- ఉపాసన దంపతులకు కమల శిశువు జన్మించిన శుభ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర చిరంజీవి యువత జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్ నేతృత్వంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఆకు పూజ నిర్వహించి, గ్లోబల్ స్టార్మ్ రామ్ చరణ్ -- ఉపాసన దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, శ్రేయస్సు ప్రసాదించాలని స్వామివారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు విష్ణుమూలకల చంద్రమోహన్, మాట్లాడుతూ చిరంజీవి కుటుంబానికి రాష్ట్ర ప్రజల అభిమానం, అభిమానుల ఆప్యాయత ఎల్లప్పుడూ అండగా ఆ కుటుంబానికి ఉంటాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి శ్రీకృష్ణ, కారుమూరి ఆంజనేష్ జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చట్ట పరిధిలో విచారించి అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ ఉమామహేశ్వర్



రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 02:చట్టపరిధిలో త్వరితగతిన విచారించి అర్జీదారులు సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ సోమవారం స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 62 మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించుకొని రాతపూర్వక అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అర్జీదారుల సమస్యలను కూలంకషంగా విని, వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఒకవేళ అర్జీని పోలీస్ శాఖ చట్టపరిధిలో పరిష్కరించడం సాధ్యంకాని పక్షంలో, ఆ సమస్య పరిష్కారానికి సంప్రదించవలసిన అధికారుల వివరాలను అర్జీదారులకు తెలియజేయాలన్నారు. అర్జీలు పదేపదే పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వృద్ధులు, మహిళలను పదేపదే పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాలకు పిలిపించవద్దని సూచించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సంబంధిత విభాగానికి పంపాలని అధికారులకు స్పష్టం చేశారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన మోసాలు తదితర పలు సమస్యల పరిష్కారానికి సంబంధించి 62 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ మహిళా ఎస్ఐ లక్ష్మీరాజ్యం, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలి

## పరీక్ష కేంద్రాలను ముందుగా నే పరిశీలించాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

**రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 02 :** జిల్లాలో మార్చి 3 నుంచి 13 వరకు ఓపెన్ స్కూల్ (ఫూఫాఫూ 2026) నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు మార్చి 3 నుంచి 13 వరకు నిర్వహించి ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ (ఫూఫాఫూ) నిర్వహించి సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి నెలలో నిర్వహించి ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు ఎలాంటి చిన్న పొరపాటు జరగకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాసే విదంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతముగా నిర్వహించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. పరీక్ష కేంద్రాలను తహశీల్దార్లు, ఆర్డీఓలు,డి ఈఓ, ఎంఈఓలు ముందుగా పరీక్ష కేంద్రాల ను పరిశీలించి అక్కడ ఏమైనా సమస్యలు ఉంటే పరీక్షలు నిర్వహించే రోజు నాటికి విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటల కల్లా పరీక్ష కేంద్రానికి




చేరుకోవాలని,సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోనికి అనుమతి లేదని తెలిపారు. విద్యార్థులు 8.30 గంటలకల్లా వారి కేటాయించిన పాఠశాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ఫస్ట్ ఎయిడ్, ఏఎన్ఎం నియమించాలని,పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని,విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవలన్నారు. పరీక్షలు అయిన వెంటనే జవాబు పత్రాలను సమీపంలో ఉన్న పోస్ట్ ఆఫీస్ కు అందజేయాలన్నారు. పరీక్ష జరిగే రోజు 144 సెక్షన్ విధించడంతోపాటు ఆ పరిసర ప్రాంతంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. జిల్లాకు వచ్చే ప్రశంస పత్రాలను జాగ్రత్తగా స్ట్రాంగ్ రూములు భద్రపరచాలని, పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పాత్రలను బందోబస్తు ద్వారా తీసుకెళ్లాలని వీటికి సంబంధించి సంబంధిత మండల స్థాయి పోలీసు అధికారులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాసులు.డి యం ఄ హెచ్ ఓ.డాక్టర్ విజయమ్మ, పోలీసు,విద్యుత్, ఆర్టీసీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ కాలేజెస్ పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ టోర్నమెంట్ ప్రారంభం




రాయల్ జర్నలిజం (వేటపాలెం), ఫిబ్రవరి 02: జె.యన్.టి.యు కె కాకినాడ అంతర్ కళాసాలల పవర్ లిఫ్టింగ్ (మెన్, ఉమెన్), బాడి బిల్డింగ్ (మెన్) టోర్నమెంట్, యూనివర్సిటి టీం సెలక్షన్స్ సోమవారం స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి కాలేజీలో ప్రారంభమైనాయి. ఈ పోటీలకు వేటపాలెం ఎస్సై పి. జనార్ధన్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ శారీరిక ఆరోగ్యానికి కృషి చేసినట్లైతే మానసిక ఆరోగ్యం ధృడంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాటులకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు జె.యన్.టి.యు కాకినాడ పరిధిలోని కళాశాలలలో చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల తరుపున విద్యార్థులకు వసతి, భోజన ఏర్పాట్లు చేశారు. జె.యన్.టి.యు కె స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధి డా. శ్యాం కుమార్ పరిశీలకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రిన్సిపాల్ డా. కె. జగదీష్ బాబు, కళాశాల డైరక్టర్స్ డా. సి. సుబ్బారావు, వనమా దొర నాగ సాయినాద్, మేనేజర్ ఆర్.వి.రమణ మూర్తి, పీడీ, జె.యన్.టి.యు కె స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబర్ అన్నం శ్రీనివాసరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సొసైటీ సభ్యుల నమ్మకానికి ద్రోహం!

## 90 సెంట్ల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన చీరాల ఐ.ఎల్.టి.డి. సొసైటీ ఛైర్మన్: కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నబాధితులు



రాయల్ జర్నలిజం (చీరాల) పిబ్రవరి 02 : చీరాల ఐ.ఎల్.టి.డి. కంపెనీ సొసైటీ ఛైర్మన్ తక్కెళ్ళపాటి చిన్న వెంకటేశ్వర్లు సొసైటీ సభ్యుల నమ్మకాన్ని దుర్వినియోగం చేస్తూ సొసైటీ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన ఘటన చీరాలలో సంచలనం సృష్టిస్తోంది. 2021 ఫిబ్రవరిలో జరిగిన ఐ.ఎల్.టి.డి. సొసైటీ ఎన్నికల ప్రచారంలో "మన సొసైటీ వద్ద భూమి తక్కువగా ఉన్నందున ప్రస్తుత భూమిని మంచి ధరకు అమ్మి, వేరే ప్రాంతంలో 3.00 ఎకరాలు కొనుగోలు చేసి కంపెనీలో పనిచేసే అన్ని క్యాటగిరీల సొసైటీ సభ్యులకు ఒక్కొక్కరికి 0.02 సెంట్లు చొప్పున భూమి ఇస్తాను" అని ఛైర్మన్ హామీ ఇచ్చారు. ఈ హామీతోనే ఎన్నికల్లో విజయం సాధించినట్లు సొసైటీ సభ్యులు చెబుతున్నారు. అనంతరం ప్రతి సంవత్సరం జరిగిన జనరల్ బాడీ మీటింగ్లలోనూ ఇదే హామీని పదే పదే పునరుద్ఘాటిస్తూ సభ్యులను నమ్మబలికారు. 2025లో జరిగిన చివరి జనరల్ బాడీ మీటింగ్లో కూడా భూమి పంపిణీ తప్పకుండా జరుగుతుందని ప్రకటించారు. కానీ, 2026 జనవరి 13 నుంచి 23వ తేదీ వరకు సొసైటీ సభ్యులందరికీ చెందవలసిన సుమారు 0.90 సెంట్ల (90 సెంట్లు) భూమిని చీరాల రిజిస్ట్రార్ కార్యాలయంలో కొంతమందికి, ఇతర రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మరికొందరికి, అంతేకాకుండా తన బినామీ పేర్లపై కూడా అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ల వల్ల సొసైటీ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని, తమకు రావాల్సిన భూమిని దోచుకున్నారని వారు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో బాధితులంతా కలిసి ఈరోజు బాపట్ల జిల్లా కలెక్టర్‌ను కలిసి, జరిగిన అన్ని అక్రమ రిజిస్ట్రేషన్లను తక్షణమే రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ అధికారికంగా అర్జీ సమర్పించారు. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి, సొసైటీ భూములపై జరిగిన అక్రమ లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# పీహెచ్‌డీ పట్టా అందుకున్న డా. మార్కండేయులు



రాయల్ జర్నలిజం (వేటపాలెం), ఫిబ్రవరి 02: అన్నామలై యూనివర్శిటీ నుంచి వేటపాలెం జనసేన పార్టీ మండల అధ్యక్షులు డా. ఉగ్గిరాల మార్కండేయులు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. సోలార్ వాటర్ హీటర్ అనే అంశంపై మార్కండేయులు పీహెచ్‌డీ డాక్టరేట్ పొందారు. అన్నామలై యూనివర్శితీ స్నాతకోత్సవంలో తమిళనాడు గవర్నర్, యూనివర్శిటీ ఛాన్సలర్ ఆర్. ఎన్. రవి చేతుల మీదగా సోమవారం డా. ఉగ్గిరాల స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ యూనివర్శిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు జనసేన నాయకులు, స్థానికులు డా. ఉగ్గిరాలకు అభినందన శుభాకాంక్షలు తెలిపారు.

రాయల్ జర్నలిజం

# ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కారం చూపాలి

రాయల్ జర్నలిజం (బాపట్ల),ఫిబ్రవరి 02 : ప్రతి సోమవారం జిల్లా



కలెక్టరేట్ లో నిర్వహించే పిజిఆర్ఎస్ లో అర్జీదారుల ఇచ్చే సమస్యల అర్జీలను పరిశీలించి పరిష్కరం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిస్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారులు చెప్పే సమస్యలను వింటూ వారి నుంచి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ లవన్న అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారు. సోమవారం జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యల 235 అర్జీలు పిజిఆర్ఎస్ లో నమోదు అయ్యాయి. మాకు న్యాయం చేయండి అంటూ అర్జీదారులు అధికారులను కోరారు. తన పరిధిలోని వాటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపడం జరుగుతుందని, కొన్నిటిని పరిశీలన, మరికొన్నింటిని విచారించాలని తర్వాత సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుంది అర్జీదారుల కు చూచించారు. ప్రజల సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రజల నుంచి ఆర్జీల స్వీకరణ జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం ఇదే క్రమాన్ని పాటించాలని సూచించారు. నమోదైన అర్జీలను పరిశీలించిన, తదుపరి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

ప్రజాప్రతినిధుల వద్దను పి జి ఆర్ ఎస్ జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి యం హెచ్ ఓ,డాక్టర్ ఎస్.విజయమ్మ సి పి ఓ.ఏ.ఎస్.రాజు, పి డి లు,డ్వామా,డిఆర్డీఏ,మెప్మా, ఐ సి డి ఎస్, గృహ నిర్మాణ సంస్థ,విజయలక్ష్మి,సింగయ్య, పాల్, రాధమాదవి,వెంకటేశ్వర రావు,



మార్క్ ఫేడ్ డి యం.కరుణశ్రీ, డి సి హెచ్ ఎస్.పద్మావతి, డి టి సి. పరందామ రెడ్డి,జి యం.డి ఐ సి.రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల,డి పి ఓ.యల్.ప్రభాకర్ రావ్,డి ఈఓ.శ్రీనివాస్,బి.సి. మరియు గిరిజన సంక్షేమ శాఖల అధికారులు శివలీలా,అబ్బులు, డి యల్ డి ఓ.విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన




రాయల్ జర్నలిజం (వేటపాలెం), ఫిబ్రవరి 02:
మండల పరిషత్ కార్యాలయ సముదాయంలోని ఐసీడీఎస్ సమావేస మందిరంలో సోమవారం మిషన్ వాత్సల్య పథకంపై వేటపాలెం మండల లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేటపాలెం ప్రాజెక్ట్ సీడీపీవో టి. ఝాన్సీ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిపాదించిన మిషన్ వాత్సల్య ప్రోగ్రాం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆదేశాల మేరకు మండలంలో అమలు చేయడం జరుగుతుందని, ఈ పథకం ద్వారా తల్లి గాని, తండ్రి గాని లేని పిల్లల చదువు నిమిత్తం నెలకు 4000 రూపాయలు చొప్పున సంవత్సరానికి రూ. 48 వేలు అందించడం జరుగుతుందని, లబ్దిదారులకు వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అవుతున్నాయని, కావున లబ్దిదారులు తమ అకౌంటు చెక్ చేసుకుని ఏదన్నా సమస్య ఉన్న ఎడల సంబంధిత అధికారికి తెలియజేయాలన్నారు. అనంతరం బాల్యవివాహాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు పుష్పవల్లి, అన్నపూర్ణ, ప్రసన్నకుమారి, తబిత, శివజ్యోతి, శేషమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో పతకాలు సాధించిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు



రాయల్ జర్నలిజం (నాగులుప్పలపాడు), ఫిబ్రవరి 02: జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరుకు చెందిన ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు హైస్కూల్ డైరెక్టర్ యు. సత్యనారాయణ సోమవారం తెలిపారు. తథాగత్ బోధిధర్మ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బోధిధర్మ డి. వెంకటేష్ పర్యవేక్షణలో ఒంగోలులోని రంగనాయుడు చెరువు సమీపంలోని మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్ నందు ఆదివారం జాతీయ స్థాయి కరాటే, కుంగ్- ఫూ పోటీలు నిర్వహించగా ఈ పోటీల్లో సుమారుగా 150 మందిపైగా విద్యార్థిని, విద్యార్థులు, 26 మందికి పైగా కరాటే, కుంగ్‌ఫూ మాస్టర్లు పాల్గొన్నారు. ఈ పోటీలకు ప్రకాశం జిల్లా నాగులప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ నుండి విద్యార్థులు కరాటే మాస్టర్ కింగ్ కావూరి నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పాల్గొని వివిధ బెల్టు క్యాటగిరిలలో తమ ప్రతిభను చూపించారు. డి. పూజిత, పి. ఆరాధ్య, టి. గాయత్రీ దేవి, జి. ప్రీతి, సిహెచ్, షణ్ముఖ శివ, ఆర్. బాల భవ్యశ్రీ సాయి, ఎం. సాత్విక్, జె. హేమంత్ శ్రీ కార్తికేయ, పి. అబ్రహం లింకన్ బంగారు పతకాలు, టి. లహరి, ఏ. గోకుల్ సాయి నరసింహరెడ్డి, రజిత పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు, కరాటే మాస్టర్ నరేంద్రరెడ్డికి హైస్కూల్ డైరెక్టర్ యు. సత్యనారాయణ, లక్ష్మీభవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

# కమనీయం వేణుగోపాలస్వామి శాంతి కళ్యాణం



